కవితా కౌముది

శ్రీ వికారి నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
24 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
కవిత విభాగంలో బహుమతి పొందిన కవితలు

# చినుకు

రాపోలు సీతారామరాజు
జోహాన్స్ బర్గ్, సౌత్ ఆఫ్రికా

వర్షం చినుకులకు
గడ్డకట్టిన పురాస్మృతులన్ని
కరిగిపోతూ మనసును
తడి చేస్తున్నాయి

ప్రళయమై ప్రపంచాన్ని
ముంచింది ఈ చినుకే

నావలోని ఔషధిని తడిపి
పునఃసృష్టి చేసింది ఈ చినుకే

తరువులకు తలంటు పోసి
తానమాడించిందీ ఈ చినుకే
గిరులకు అభిషేకం
చేయించిందీ ఈ చినుకే

చెరువులా మారి
నదియై నడిచి

పసిడి పంటల్ని
పండించిందీ ఈ చినుకే

గరళ కంఠుడి తలపై దుమికి
పావన గంగలా
అమృతాన్ని పారించిందీ ఈ చినుకే

బోధివృక్షాన్ని తడిపింది ఈ చినుకే
సిద్దార్థున్ని బుద్ధుడిగా అవతరింపజేసింది ఈ చినుకే

అశోకుడి రక్తఖడ్గాన్ని కడిగి
పశ్చాత్తాప మార్గాన్ని చూపిందీ ఈ చినుకే

శిలువపై రక్తమోడుతున్న ఏసును
కన్నీటి చుక్కగా మారి కడిగింది ఈ చినుకే

విత్తుని విత్తంగా మార్చి
జగత్తుకి పిడికెడు తిండి పెట్టేదీ ఈ చినుకే
నరుడికి నాగరికత నేర్పిన
నవీన గురువూ ఈ చినుకే

ఆల్చిప్పలో బిందువులా చేరి
సత్యాన్ని ఆవిష్కరించిన
స్వాతిముత్యం ఈ చినుకే

ప్రాణమై నిన్ను
నిలిపేది ఈ చినుకే
ఉప్పెనై నిన్ను
ముంచేది ఈ చినుకే!
సకల లోకాన్ని నడిపేది ఈ చినుకే
నాలోని లోకాన్ని కడిగిందిప్పుడు ఈ చినుకే!!

# మలుపు

పాలపర్తి ఇంద్రాణి

హ్యూస్టన్, టెక్సాస్

బిందె బిందెను చేదిచేది
మబ్బులన్నీ నింపి నింపి
నల్ల మబ్బుల గాలిబండిని
ఉత్తరానికి సాగనంపి
చేద గిలకను జారవిడిచాను

ఇంటి ఇంటి తలుపు తట్టి
పైడి పలుకుల నేతి అటుకులు
మనిషి మనిషికి పంచిపెట్టి
భిక్ష తెచ్చిన కల్లు ఉప్పును
సముద్రానికి దానమిచ్చాను

పాట పాటకు తలను ఊపి
పిచ్చి ఊహలు చేసి రాసి
తొలుత ఎంతో వేగిపోయి
ఒలిచి పోసిన అక్షరాలను
ఎదురు గాలికి వదిలి పెట్టాను

బాధలేవీ ముందు లేవని
వెనుక బాధలు వెంటరావని
తలపులన్నీ మట్టి బెడ్డలు
చెరువులోనికి విసిరికొట్టి
చల్లగాలికి తెరిపి పడ్డాను

నిదురలోనా దిగులు విడచి

ఘడియ ఘడియకు నన్ను మరచి
నిదుర లేచిన కలలు చలి చలి
మరపు దుప్పటి పాతదేలే
కునుకు తలగడ తెచ్చుకున్నాను

అర్ధం కాదు

రమాకాంత్ రెడ్డి
మెల్బోర్న్, ఆస్ట్రేలియా

# ప్రశంసా పత్రం

పొగిలి పొగిలి ఏడవకుంటే గుబులు లేదని అర్ధంకాదు
గొంతు పెగలకుంటే గుండె పగలలేదని అర్ధం కాదు

నువు నవ్వొచ్చు ఏడ్వొచ్చు ఉద్వేగంలో మునిగితేలొచ్చు
నువు లీనమైపోయినా కథ వాస్తవమని అర్ధం కాదు

గాలికైనా చోటివ్వకుండా నిన్ను పెనవేసుకుపోయినా
మనమధ్య ఏదో తరగని దూరం, ఎందుకో అర్ధంకాదు

అరువు తెచ్చుకున్న పదాల పట్ల ఇంతటి నిర్లక్ష్యమా?
'పాకి' అంటే 'మలినము' అని అర్ధం కాదు

మనసు ముందు పుటలోనో వెనుక పుటలోనో ఉంటే

ఈ పుటలోని అతి సరళ వాక్యం కూడా అర్థం కాదు

చివరికి రాజు బ్రతకడం ఒక్కటే ముఖ్యమైపోతుంది

చంపిందీ చచ్చిందీ ఎందుకో ఏ పావుకీ అర్థంకాదు

చేతికో కాలికో గుచ్చుకుని ఉంటే సులభతరమయ్యేది

గుండెలోతుల్లో ముల్లు ఎలా తీయాలో అర్థంకాదు

ఇప్పుడు ఆ పాటలో ఏ మాటా జ్ఞాపకం లేదు

మదిలో స్వరమెందుకు మెదులుతూ ఉందో అర్థంకాదు

దట్టమైన అడవుల్లో వేటకెళ్ళే జంతువులకు

ఇంటికొచ్చే దారెలా గుర్తుంటుందో అర్థంకాదు

నా ముఖంపై అందరూ ఉన్నాయంటున్న మచ్చలు

నాకు అద్దంలో ఎందుకు కనబడవో అర్థంకాదు

ఈ ప్రపంచం నాలో చేరి చేస్తున్న జాతరలో

నాలోని పసివాడు ఎక్కడ తప్పిపోయాడో అర్థంకాదు

నువ్వు ముద్దుముద్దుగా ఏం జరిగిందని అడుగుతావు

ఎక్కడినుండీ మొదలుపెట్టాలో నాకు అర్ధంకాదు

జీవితం చీలినదారుల కూడలిలో నిలబెడుతుంది

ఏదారి ఎటు తీసుకుపోతుందో అర్ధంకాదు

పగలులో లేని అందం రాత్రిలో లేని చందం

అవి కలిసినప్పుడు ఎలా వస్తాయో అర్ధంకాదు

తాత చెప్పిన కథలలో ధర్మసందేహం ఒక్కటే

కథలన్నీ కంచికే ఎందుకు వెళ్ళాయో అర్ధంకాదు

ఒక గట్టినమ్మకం మనిషిని మృగంలా మారుస్తుంది

ఏ పవిత్రగ్రంధంలో ఏమని వ్రాసుందో అర్ధంకాదు

విప్పితే పెను ఉప్పెన విప్పకుంటే నిప్పుల కుంపటి

ఈ జీవిత ప్రవహ్లిక విప్పాలో వద్దో అర్ధంకాదు

నలుగురిలో నీ ఊహలు గిలిగింతలు పెడుతుంటే

ఎందుకు నవ్వుకుంటున్నావో ఎవ్వరికీ అర్ధంకాదు

రెక్కలు టపటపలాడిస్తూ గువ్వ ఎగిరిపోయేముందు

నావైపు అరక్షణం చూసిన చూపు అర్ధంకాదు

పంటిబిగువున పుట్టెడు దుఃఖాన్ని దిగమింగి
అమ్మ ఎందుకు నవ్వుతుందో చిన్నారికి అర్ధంకాదు

నేను శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తూనే ఉన్నాను
అర్ధమైనట్టే ఉంటుంది కానీ, లోకం తీరు అర్ధంకాదు

నువ్వు కుశలమడిగితే నేను కుశలమనే అంటాను
నా కళ్ళు చెప్పిన సమాధానం నీకు అర్ధంకాదు

జీవితం దగ్గర అన్ని సమాధానాలూ సిద్ధంగా ఉన్నాయి
సరైన ప్రశ్నలు ఎలా అడగాలో నాకే అర్ధంకాదు

హేమార్ణవ కౌముదిలో గుండె బరువెక్కిపోతుంది
అంతగా గుండెల్లో ఏం నిండుకుంటుందో అర్ధంకాదు
మధుశాలలో వచనం ఒకటైతే వాచ్యం వేరొకటి
మధుబాలా, ఇక చాలు అంటే ఇక చాలు అని అర్ధంకాదు
'అంజలీ', ఇన్నేళ్ళ తర్వాత నీకు వ్రాస్తున్న లేఖలో
అక్కడక్కడా అక్షరాలెందుకు చెదిరిపోతున్నాయో అర్ధంకాదు!

# కణం-క్షణికం

ఫణి రాజేష్
యోకోహామా, జపాన్

## మొట్ట మొదటి కవితావిభాగం

బాల్యపు ధీమా:
ఏడుపు: ప్రపంచాన్ని గెలవడానికి వాడే ఆయుధం
నవ్వు: ప్రపంచం గెలిచాక వచ్చే పతకం
ఆటలు: ఇదే ప్రపంచం అని నడిపించే ఇంధనం
తోడు: నవ్వు కి ఏడుపు కి మధ్య అనుసంధానం
యవ్వనపు భ్రమ:
నీ చూపు నా మౌనానికి మాటలు నేర్పింది
నీ పలుకు నా మాటలకి అర్థం చెప్పింది
నీ అడుగు నా పయనానికి గమ్యం చూపింది
నిన్ను కలిశాకే నాకు నేను తెలిసొచ్చింది
నావికా శ్రమ:
మాటకి పెదవి దూరం
మనసుకి ఊరట దూరం
మనిషికి మనిషి దూరం
ఈ సమరం సుదూరం
ధీమాగా తిరిగే బాల్యాన్ని, భ్రమలో బ్రతికే యవ్వనాన్ని, శ్రమైక నావికాజీవితాన్ని,
నెమరువేసుకునే "క్షణికమైన"అనుభూతుల సమ్మేళనం వానప్రస్థం

# కాలం కలం పట్టినవేళ

సావిత్రి తాడికొండ
ఫెయిర్ లాన్, న్యూ జెర్సీ

## ప్రశంసా పత్రం

నీకన్నా బలవంతుడు లేడని
విర్రవీగే ఓ తెలివితక్కువ మనిషీ
నిమిషం, గంట, సంవత్సరం అంటూ
నువ్వు నాకు పేరు పెట్టావు కానీ
నిన్ను నడిపించేదే నేనని తెలుసా నీకు
బాల్యం, యవ్వనం అంటూ ఎంతో సమయం ఇచ్చాను
దేనికోసం నీ నిరంతర పోరాటం
ఒక్కసారెయిన గుర్తించావా నీ సాటి మనిషిని
ఒక్క నేస్తమున్నా చాలంటావు నీ ఆఖరి నిమిషంలో

COMMENTS